క్లుప్తంగా

బీరువా వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా అందజేస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం

రాజంపేట టౌన్ : రిటైర్డ్ హెచ్‌ఎం ఎ.శంకర్‌రాజు మంగళవారం మండలంలోని తుమ్మల అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం బీరువాను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలందరూ నిరుపేద పిల్లలని వారికి పౌష్టిక ఆహారం అందచేయడంతో పాటు ఆట, పాటలతో విద్యాబోధనలు చేసి చదువుపట్ల ఆసక్తి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఆదిలక్ష్మి, వి.రాధాకృష్ణ, చల్లా సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వయోజన విద్య వాలంటీర్లకు మంగళవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో మొత్తం 380 నిరక్షరాసులు ఉన్నారని తెలిపారు. వీరికి చదువు చెప్పడానికి 38 మంది వాలంటీర్స్, టీచర్స్‌లను గుర్తించినట్లు చెప్పారు. నిరక్షరాసులకు చదువు చెప్పడంలో పద్ధతులను గురించి వారికి వివరించామన్నారు. వాలంటీర్ టీచర్స్‌కు ఒక హ్యాండ్‌బుక్, నిరక్షరాసులకు ఒక వాచకం, హాజరు రిజిస్టర్, 2025 క్యాలెండర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వయోజన విద్య సూపర్‌వైజర్స్, వాలంటీర్లు, టీచర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం తనిఖీ



సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ నైదియా దేవి

పుల్లంపేట : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని కుమారునిపల్లి గ్రామానికి చెందిన బి.రాధ ఇంటి స్థలానికి సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు హద్దులు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. ప్రజల నుంచి అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలంటూ తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుశీల్ కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

పుల్లంపేట : మండల ఎంఈఓ చక్రాధర్ రాజు ఉత్తమ విద్యాశాఖ అధికారిగా ఎంపికై గణతంత్ర దినోత్సవం రోజు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పుల్లంపేట ఎస్టీయూ నాయకులు ఎంఈఓ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు బుదారపు నరేంద్రనాథ్, మండల అధ్యక్షులు సిద్దయ్య, శివరాం, ప్రసాద్, శ్రీనివాసులు, గౌస్, అశోక్ కుమార్, హేమలత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమాతో గ్రామీణులకు భరోసా



రమణమ్మకు చెక్కును అందజేస్తున్న పోస్టల్ అధికారులు

చిట్వేలి : గ్రామీణ తపాలా జీవిత బీమా గ్రామీణ ప్రజలకు భరోసా అని రాజంపేట సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. చిట్వేలి సబ్ పోస్టాఫీస్ పరిధిలోని అనుంపల్లి బ్రాంచ్‌లో ఎం.రమణమ్మకు మంగళవారం రూ.2,28,800ల బీమా చెక్కును అందజేశారు. ఇటీవల తపాలా జీవిత బీమా కస్టమర్ ఎం.చంద్రశేఖర్ గుండెపోటుతో మరణించగా నామినీగా ఉన్న భార్య రమణమ్మకు మంజూరు చేశారు. ఈ సందర్భంగా పోస్టల్ అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు పోస్టల్ బీమా పొందాలని ఈ సందర్భంగా తెలియజేశారు. బీమాతో అనుకోని ప్రమాదాలు జరిగితే కుటుంబానికి ధీమా ఉంటుందని చెప్పారు. అలానే పోస్టల్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారి మునాఫ్, చిట్వేలి సబ్ పోస్ట్ మాస్టర్ ఎస్.హరికృష్ణ, అధికారులు సుబ్రమణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కట్టపై ప్రయాణం ప్రమాదకరమే!

భద్రతా చర్యలు కల్పించాలంటున్న వాహనదారులు



పోలి చెరువు కట్టపై ప్రమాదకరంగా వున్న ప్రాంతం

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణ శివారుల్లో ఉన్న పోలి చెరువుకట్టపై వెళ్లే రోడ్డు మార్గం కొంతమేర ప్రమాదకరంగా వుంది. పోలి చెరువుకట్టమీద ఉన్న రోడ్డు మార్గం ద్వారా నెల్లూరు, విజయవాడ నగరాలకు రాజంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లోని అనేక గ్రామాలకు వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే ఈ చెరువు కట్టపై రోడ్డు కిరువైపులా చాలా వరకు రక్షణగా ఇనుప కవచాలను ఏర్పాటు చేశారు. అయితే సగిలక్కమాను సమీపంలో కొంతమేర రక్షణ కవచాలు లేకపోవడంతో ప్రమాదం పొంచివుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పోలి చెరువు దాదాపు నిండివుంది. సింగిల్ రోడ్డు కావడంతో ఒకేసారి ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో వాహనాలను చెరువు కట్టకు ఆనుకొని వాహనాన్ని నడపాల్సి ఉంటుందని వాహనదారులు అంటున్నారు. ఆ సమయంలో ఏమాత్రం పొరపాటు జరిగినా వాహనం చెరువులోపడే ప్రమాదం ఉంటుందన్న ఆందోళన వాహనాదారులు వెలిబుచ్చుతున్నారు. ఇదిలావుంటే ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ శివరాత్రి మహోత్సవం ఉన్నందున ఆ రోజు నుంచి మూడు రోజులపాటు పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాలకు నిత్యం వేలాది మంది భక్తులు పోలిచెరువుకట్ట మీదుగానే వెళ్లాల్సివుంది. శివరాత్రి సమయంలో రాత్రి వేళల్లోనూ భక్తులు పెద్దఎత్తున హత్యరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అందువల్ల సంబంధితశాఖ అధికారులు స్పందించి పోలిచెరువు కట్టపై పూర్తిస్థాయిలో భద్రతా చర్యలను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అప్రమత్తంగా లేకుంటే..



పోలి చెరువు కట్టపై సగిలక్కమాను సమీపంలో రక్షణ కవచం లేదు. పోలి వైపు నుంచి వచ్చే వాహనాదారులు అప్రమత్తంగా వాహనం నడపకుంటే సరిదిద్దుకోలేని ప్రమాదం జరుగుతుంది. అనేక గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోలు, స్కూల్ వ్యాన్‌లలో పోలి చెరువుకట్ట మీదుగా రాజంపేట పట్టణంలోని పాఠశాలలకు వస్తుంటారు. అందువల్ల అధికారులు స్పందించి రక్షణ కవచం ఏర్పాటు చేయాలి.

– శేఖర్, ఆటోడ్రైవర్, సీతారాంపురం, రాజంపేట మండలం

అధికారులే బాధ్యత వహించాలి



పోలి చెరువుకట్టపై కొంతమేర రక్షణ కవచం ఏర్పాటు చేయకపోవడంతో ఎంతో ప్రమాదకరంగా వుంది. వచ్చే నెల 26వ తేదీ నుంచి శివరాత్రి ఉత్సవాలు జరగనున్నందున వేలాది మంది పోలి చెరువుకట్ట మీదుగా రాత్రి వేళల్లోనూ హత్యరాలకు వెళతారు. అందువల్ల శివరాత్రిలోపు పోలి చెరువు కట్టపై పూర్తిస్థాయిలో రక్షణ కవచాలను ఏర్పాటు చేయాలి. లేకుంటే ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది.

– శిల్పి రాజాచారి, రాజంపేట

మతసామరస్యంతో జీవించడం సంతోషదాయకం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే

రాజంపేట : రాజంపేటలో మతసామరస్యంతో ప్రతి ఒక్కరూ కలసిమెలసి, ఆప్యాయలతో జీవిస్తున్నారని, ఇది ఎంతో సంతోషదాయకమని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే అన్నారు. ఏఎస్పీ కార్యాలయంలో భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్ర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు కీలకపాత్ర పోషించారన్నారన్నారు. అటువంటి వారు మనందరికి ఆదర్శమన్నారు. అల్ బదర్ మసీదు కమిటీ అధ్యక్షుడు గండికోట గుల్జార్‌బాషా మాట్లాడుతూ తొలిసారిగా పోలీసుశాఖ ఐపీఎస్, రెవెన్యూశాఖ ఐఏఎస్ రావడం శుభదాయకమన్నారు. సివిల్ విజేతల పాలనలో రాజంపేట ప్రజల సమస్యలు పరిష్కారం సత్వరమే లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మైనార్టీ హక్కుల కమిటీ రాజంపేట నేతలు అబ్దుల్ రజాక్, మదీనా అదిల్, షేక్ బుజ్జి కమల్, సైకిల్ జావిద్, టీచర్ జాఫర్, అల్ బదర్ మసీదు కార్యవర్గ సభ్యులు షేక్ చాంద్‌బాషా, టంగుటూరు బాషా, షేక్ అన్వర్‌బాషా, నజీర్‌బాషాలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నేతలు, కార్మికులు

రాయచోటి అర్బన్ : ఫిబ్రవరి 16, 17 తేదీలలో రైల్వేకోడూరులో జరుగనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘం నేతలతో కలసి వారు జిల్లామహాసభల కరపత్రాలను విడుదల చేశారు. మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేయడం, వాటి స్థానంలో లేబర్‌కోడ్‌లను అమలులోకి తెచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్, ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, గ్రీన్ అంబాసిండర్ కార్మికులు, వాచ్‌మెన్‌లకు ఉద్యోగభద్రతను కల్పించి పెండింగ్ వేతనాలను చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. మహాసభలలో కార్మికులు, చిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలకు పోరుబాటకు శ్రీకారం చూడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మిడ్‌డే మీల్స్ వర్కర్స్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నేతలు నేలపాటి శ్రీనివాసులు, నాగరాజు, బత్తల రమణ, నేతలు వెంకటరమణ, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు ఆధార్ కార్డులు మంజూరు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కమలాకర్

రాజంపేట రూరల్ : ఎన్‌టీఆర్ ఎస్‌టీ కాలనిలోని 80 ఎస్‌టీ యానాది కుటుంబాలకు ఆధార్ కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగాల కమలాకర్ తహసీల్దార్‌ను కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పీర్‌మున్నీకి మంగళవారం కమలాకర్ ఎస్టీ యానాదులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి 80 కుటుంబాల వారు ఎన్‌టీఆర్ ఎస్టీ కాలనీలో జీవిస్తున్నారు. వీరిలో దాదాపు 100 మందికి పైగా ఇప్పటికీ ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 సంవత్సరాల నుంచి యానాదులకు ఆధార్ కార్డులు రావటం కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని తెలియజేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకొని యానాదులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీ యానాదులు అధిక సంఖ్యలో పిల్లలతో కలిసి పాల్గొన్నారు.


ఇ-పంట నమోదు తప్పనిసరి



బొగ్గిడివారిపల్లెలో చామంతి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దవటం : ప్రతి ఒక్క రైతు రబీలో సాగు చేసిన పంటకు సంబంధించి ఇ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇ-పంట నమోదు చేయించుకోవడం వల్ల ఉపయోగాలను రైతులకు వివరించారు. రైతులకు అవసరమైన రసాయనిక ఎరువులు అందుబాటులో ఉన్నట్లు రైతులకు తెలిపామన్నారు. ఫిబ్రవరి 14వ తేదీలోపు ఇ-పంట నమోదు, ఈకేవైసీలను రైతులు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. డ్రిప్ సౌకర్యాన్ని సబ్సిడీపై అందిస్తున్నామని రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం బొగ్గిడివారిపల్లెలో బొగ్గిడి శివరామిరెడ్డి చామంతి పంటను పరిశీలించి రసం పీల్చు పురుగు నివారణకు జిగురు పూసిన పసుపు, నీలరం, తెలుపు పల్లాలు అమర్చడం చేయాలని, వేప నూనె పిచికారీ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ రమేష్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సందీప్ సింహ యాదవ్, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, బొగ్గిడివారిపల్లె సర్పంచ్ ప్రతినిధి పులి ఓబయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం



ఎంపీడీఓ, ఎస్‌ఐతో చర్చిస్తున్న తహసీల్దార్

గాలివీడు : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 13వ సాధారణ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు జిల్లా పద్మావతమ్మ అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు పేర్కొన్నారు. అయితే ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ జవహర్‌బాబు, ఎస్‌ఐ రామకృష్ణతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు తప్ప ఇతరులెవ్వరూ కార్యాలయంలోకి రాకూడదని సూచించారు.

రేపు ఉచిత నాటక ప్రదర్శనలు

రాజంపేట టౌన్ : పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామంలోని ఈడిగపల్లెలో గురువారం రాత్రి ఏడు గంటల నుంచి ఉచిత నాటక ప్రదర్శనలు ఉంటాయని అన్నమయ్య కళాకారుల ఐక్యవేదిక రాజంపేట శాఖ అధ్యక్షులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాటక ప్రదర్శనల్లో భాగంగా చింతామణి (భవాని సన్నివేశం), బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర (కాటిసీను) నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కళాకారులు, కళాభిమానులు, ప్రజలు ఈ నాటక ప్రదర్శనలను తిలకించాలని కోరారు.

పశు ఆరోగ్య శిబిరం

రామాపురం : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ కాంపల్లె అరుంధతివాడ, కొత్తరోడ్డు సూర్యనారాయణపురం గ్రామాలలో మంగళవారం ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి 102 పశువులకు ప్ర థమ చికిత్స, 6 గర్భకోశ సమస్యల పశువులకు, 134 పశువులకు, 83 దూడలకు, 2086 గొర్రె లు, మేకలకు, నట్టల నివారణ మందులను మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి అందించారు. పశువులకు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు అందించారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు కీ.శే. మద్దిరేవుల వెంకటరెడ్డి 12వ వర్ధంతి వేడుకలు మద్దిరేవుల రెడ్డివారిపల్లెలో మంగళవారం నిర్వహించారు. వెంకటరెడ్డి ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి కుటుంబసభ్యులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మద్దిరేవులు కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొని నివాళి అర్పించారు.

సర్వసభ్య సమావేశం నేడు

పుల్లంపేట : పుల్లంపేటలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఏయూలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో కేడెట్స్

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో ఎన్‌సీసీ మూడు రోజులపాటు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ప్రధానంగా ఎన్‌సీసీ బీ అండ్ సీ సర్టిఫికెట్ పరీక్షల కోసం విద్యార్థులు సన్నద్ధం చేయడంలో ఈ శిక్షణ దోహదపడుతుంది. 5 ఆంధ్రా గరల్స్ బెటాలియన్ సీహెచ్‌ఎం కర్నాల్‌సింగ్, నాయబ్ సుబేదార్, వెంకటేశ్‌లు శిక్షకులుగా వ్యవహారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత, సమాజానికి సేవాదృక్పథం అభివృద్ధి చేయడానికి అవసరమైన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. తొలిరోజు శిక్షణ శిబిరంలో 150 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ డా.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ నారాయణ, పీడీ నాగముని, ఎన్‌సీసీ సీటీఓ దీప్తి, ఏపీడీ సైపుల్లా పాల్గొన్నారు.

సస్యరక్షణ పాటిస్తే దిగుబడులు

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు అధికారులు తెలిపిన సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడులు పొందవచ్చిన వైఎస్సార్ ఉద్యాన కళాశాల పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, వై మోహన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఓబనపల్లి పంచాయతీలో బొప్పాయి రైతులకు సస్యరక్షణలపై వారు అవగాహన కల్పించారు. అలాగే 20 మంది రైతులకు అర్కా మైక్రోబిఎల్ కమ్సాసియమ్, జిగురు అట్టలు అందించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పొలాలలో రైతులు అధికారుల సలహాల మేరకు వ్యవసాయం నిర్వహించినప్పుడు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎరువుల వాడకం, మొక్క మొదలు భాగంలో సస్యరక్షణలపై ప్రతి రైతు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చీడపీడల నివారణకు అధికారులను సంప్రదించి మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, హెచ్‌ఓ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చార్టులను విడుదల చేస్తున్న పీడీ రమాదేవి, సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : మాతా, శిశు మరణాలు తగ్గించాలని అన్నమయ్య జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారిణి రమాదేవి పేర్కొన్నారు. నీతి ఆయోగ్ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 75 అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యకర్తలకు పోషణ ట్రాక్టర్, బాల సంజీవిని యాప్‌లో నమోదు చేయాల్సిన ఇండికేటర్స్ శాతం తక్కువగా ఉందని, దీనిని వంద శాతానికి పెంచాలని కార్యకర్తలుకు సూచించారు. గర్భిణుల వైద్య పరీక్షలను ఆధారంగా చేసుకుని అంగన్‌వాడీలు పోషకాహారాలు అందించి నవజాత శిశువు బరువు పెంచేందుకు దోహదపడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు యాప్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, సీడీపీఓ పద్మావతి, నీతి ఆయోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, అంగన్ వాడీ పర్యవేక్షకులు దాదీబి, తులసమ్మ, లతా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ బాబు

సిద్ధవటం : మండలంలోని వెలుగుపల్లె గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. చదువుకోని వారు, చదువుకున్న వాళ్లు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారన్నారు. కొరియర్ పేరుతో మోసాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, మోసాలు, రూ. 10లక్షలు పెట్టుబడి పెడితే రూ. 10 కోట్లు ఇస్తామని, వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తదితర సైబర్‌నేరాలపై అవగాహన పెంపొందించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర, పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సేవే పరమాత్మ సేవ



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయడమంటేనే పరమాత్మ సేవగా భావించడమనేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి నేర్చుకున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలతో మంగళవారం ఆకేపాటి మమేకమయ్యారు. ప్రజా సమస్యలు విని వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు. నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే ముఖ్యమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం ప్రజలకు తనే స్వయంగా అల్పాహారం అందజేశారు.

నివాళి

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ అన్న కసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు పంజం సుకుమార్ రెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, సిద్దవరం గోపిరెడ్డి, గీతాల నరసింహారెడ్డి, అరిగెల సౌమిత్రి, కొండూరు అజయ్ రెడ్డి, పాటూరు వాసు, పాటూరు జగ్గిరెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, గీతాల నరసింహ రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, అరిగె హరిబాబు, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, విజయుడు, చంద్ర, మహబూబ్ బాషా, నవాబ్, ఆనాల మధు యాదవ్, పసతల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసివున్న శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాన్ని మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, మండల యువత కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు జరిగిన స్వామివారి అభిషేకంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, స్థానిక ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక శివాలయం నుంచి మేళతాళాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య త్యాగరాజు స్వామి చిత్రపటానికి గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం నాదస్వరం, డోలు కళాకారులను పొందలూరు సుబ్బరాయుడు శాలువాలు కప్పి సన్మానించారు. సాయంత్రం 6 గంటల నుంచి పెద్దపల్లి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరిగిన చిన్నపిల్లల నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గం సభ్యులు పి.వెంకట సుబ్బయ్య, పెద్దపల్లి సుబ్బరాయుడు, పొందలూరు సుబ్రమణ్యం, కంబగిరి మునిరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక రుసుం వసూలు చేయకూడదు



మీ సేవ కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ పుల్లారెడ్డి

రాయచోటి టౌన్ : మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కన్నా అధికంగా వసూలు చేస్తే కేంద్రాలను రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని రాయచోటి తహసీల్దార్ పుల్లారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని పలు మీ సేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ నియమ, నిబంధలను ప్రకారం కేంద్రాలను నడపాలన్నారు. పలు మీ సేవ కేంద్రాలు వినియోగదారుల నుంచి అధిక రుసుం వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయని చెప్పారు. అలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వయోజనులను అభ్యాసకులుగా చేయాలి



శిక్షణా కార్యక్రమానికి హాజరైన సిబ్బంది

పెనగలూరు : గ్రామాలలో వయోజనులందరినీ అభ్యాసకులుగా చేయాలని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. మంగళవారం వయోజనుల కోసం ఏర్పాటు చేసిన 60 మంది వాలంటీర్లలకు అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవసరమని వారు తెలిపారు. అందుకే వయోజనులను అభ్యాసకులుగా చేసేందుకు వాలంటీర్లు కృషి చేస్తారన్నారు. వయోజనులకు పుస్తకాలు, క్యాలెండర్‌లను అందజేశారు. అలాగే మొబైల్ ద్వారా జరుగుతున్న మోసాలపై వయోజనులకు వాలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్ రెడ్డి, నిరంజన్, సూపర్‌వైజర్లు నరసారెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు సహకరించండి

వీరబల్లి : సోషల్ మీడియా వలన కలిగే నష్టాలపై ముఖ్యంగా బాలికలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పిల్లల సంరక్షణ యూనిట్ సోషల్ వర్కర్ శైలజ, అవుట్ రీచ్ వర్కర్ సురేష్‌లు తెలిపారు. మంగళవారం మండలంలోని సానిపాయి గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వస్తున్న అనేక విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న వారికి భవిష్యత్తులో కలిగే ఉపద్రవాలు గురించి వివరించారు. ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడితే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, వీటిని అరికట్టేందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రివేణి, స్కూల్ అసిస్టెంట్ రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.